కోటి సంతకాల సేకరణ



సంతకాల సేకరణలో పాల్గొన్న బజరంగ్‌సేనా ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: గోవును రాష్ట్ర మాతగా ప్రకటించాలని బజరంగ్‌సేనా ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాల సేకరణను చేపడుతున్నామని సేనా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌ఆర్.లక్ష్మణ్‌రావు అన్నారు. గురువారం రాష్ట్రంలోని వివిధ జిల్లాలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..హిందువులకు ఎంతో పవిత్రమైన గోమాతను రాష్ట్ర మాతగా ప్రకటించాలని ఇప్పటికే ఉద్యమం చేపట్టామన్నారు. ఈ క్రమంలో అన్ని ఆధ్యాత్మిక కేంద్రాల్లో కోటి సంతకాల సేకరణ చేపట్టిన అనంతరం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు అందజేస్తామన్నారు. ప్రజల అధిష్టాన్ని ప్రభుత్వాలు గుర్తించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సేనా రాష్ట్ర కార్యదర్శి సూర్యశుక్లా, సత్యనారాయణరెడిడ, ఆంజనేయులు, కృష్ణాయాదవ్, కాశి విశ్వనాథ్, అశోక్‌కుమార్, రాజేశ్వర్, రాజారామ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

బండ్లగూడ: ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర వెల్లడించారు. గురువారం కార్పొరేషన్ పరిధి 10వ డివిజన్‌లోని శివసాయినగర్, 9వ డివిజన్‌లోని ముదిరాజ్ సంఘం లైన్‌లో ఆయన పర్యటించారు. చెత్త సేకరణ కార్మికులు, ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం కిస్మత్‌పూర్ మెయిన్ రోడ్డుపై స్వీపింగ్ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలు తమ ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ కార్మికులకు తడి, పొడి చెత్తను వేరు చేసి అందించాలని సూచించారు. చెత్తను రోడ్లకు ఇరువైపుల, ఖాళీ ప్రదేశాల్లో వేయకూడదని పేర్కొన్నారు. ప్రజా ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నామన్నారు. ఎవరైనా చెత్తను రోడ్లపై పారవేస్తే వారికి జరిమానా విధిస్తామన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు, స్వచ్ఛ ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రై'వేటు'కు బలవుతున్న విద్యార్థులు

- ఆధిపత్యం చాటుకోవడానికి పోటాపోటీగా కార్యక్రమాలు
- వేడుకల పేరుతో డబ్బుల దోపిడీ
- చిన్నారులకు చిదిమేస్తున్న యాజమాన్యాల నిర్లక్ష్యం

గోల్కొండ: ప్రైవేటు పాఠశాలల దోపిడీకి అడ్డూ అదుపు లేకుండాపోతోంది. మార్కెట్‌లో తమ ఆదిపత్యం చాటుకోవడానికి ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ప్రీ ప్రైమరీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాలు సైతం భారీ ఎత్తున ఫంక్షన్‌హాల్స్, క్రీడా మైదానాలలో నిర్వహిస్తున్నారు. ఉన్నత పాఠశాల తరగతి వారికి క్రీడాపోటీలు, వార్షికోత్సవ వేడుకలను సైతం ఖరీదైన ఆడిటోరియంలు, ఎల్‌బీ స్టేడియం లాంటి ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారు. దీనికి అయ్యే ఖర్చు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచే పాఠశాలల నిర్వాహకులు వసూలు చేసుకుంటున్నారు. గత మంగళవారం టోలిచౌకీలోని ఓ పాఠశాల వారు టోలిచౌకీకి దూరంగా ఉన్న ఎల్‌బీస్టేడియంలో వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో యూకేజీ పూర్తి చేసుకున్న ఓ విద్యార్థి స్టేడియంలో ఉన్న సంపులో పడి మృతి చెందాడు. ఈ ఘటనలో పాఠశాల యజమాన్యం పూర్తిగా నిర్లక్ష్యం వహించిందని పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నాయి.

ఏర్పాట్లలో నిర్లక్ష్యం..

పాఠశాలల వేడుకలు పాఠశాలలో కాకుండా స్టేడియాలు, ఆడిటోరియంలో నిర్వహించడం తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడుతోంది. మరో వైపు పిల్లలకు సైతం ప్రాణాల మీదకు వస్తుంది. వేడుకలు జరిగే ప్రాంతంలో సరైన జాగ్రత్త చర్యలు తీసుకోవడంలో పాఠశాలల నిర్వాహకులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఆడిటోరియంతో పాటు స్టేడియంలో విద్యార్థుల రక్షణను గాలికి వదిలేస్తున్నారు. వేదిక వద్ద సెక్యూరిటీ సిబ్బందిని నియమించకపోవడం నిర్వాహకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది. పాఠశాలలో కాకుండా ఇతర ప్రాంతాల్లో వేడుకలు నిర్వహించే పాఠశాలల వారికి విద్యా శాఖ వారు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని స్పష్టం చేయాలి. దీన్ని వల్ల పాఠశాల నిర్వాహకులు ఇతర ప్రాంతాల్లో వేడుకలు నిర్వహించుకోవడానికి అధికారుల అనుమతి తీసుకోవాలి. ఏదేమైనా మంగళవారం ఎల్‌బీ స్టేడియంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో పాఠశాల నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా ఓ ఐదేళ్ల బాలుడు ప్రాణాలు కోల్పోయాడు.

కఠిన చర్యలు తీసుకోవాలి..



పాఠశాలకు సంబంధించిన ఏ కార్యక్రమం అయినా సరే పాఠశాలల్లోనే జరుపుకోవాలి. ఇతర ప్రాంతాల్లో నిర్వహించే పాఠశాలల వారు పోలీసులు, విద్యా శాఖ అనుమతులు తీసుకోవాలి. కార్యక్రమం జరిగే వేదిక వద్ద పాఠశాల వారు సొంతంగా సెక్యూరిటీ సిబ్బందిని నియమించడంతో పాటు సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేసుకోవాలి. విద్యార్థి మృతికి కారణమైన పాఠశాల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– మహ్మద్ నజీబ్, తెలంగాణ ఫ్యామిలీకౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్

ప్రైవేటు పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి..



పాఠశాలల నిర్వాహకుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలి. ఇష్టారాజ్యంగా ప్రైవేటు పాఠశాలల నిర్వాహకుల కార్యక్రమాలు, వేడుకల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారు. పిల్లలు పడే కష్టాలు నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకొని వాటి గుర్తింపును రద్దు చేయాలి.

– మెర్జా ఎక్బాల్ అహ్మద్, సమత కాలనీ టోలిచౌకీ

ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలు పెరగాలి



విద్యార్థులను అడిగి సమాచారం సేకరిస్తున్న దీపేష్ రాజ్ వర్మ

చార్మినార్: ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలను పెంచడంతో పాటు విద్యార్థులకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత ఉపాధ్యాయులను కోరినట్లు ఏఐఎంఐఎం పార్టీ ఓబీసీ ఇన్‌చార్జి ఆర్. దీపేష్ రాజ్ వర్మ తెలిపారు. గురువారం ఉదయం పురాణాపూల్ స్టార్ మహిళలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి అక్కడ విద్యార్థుల విద్యా బోధనను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఉపాధ్యాయులు గుణాత్మకమైన విద్యను అందజేయాలని కోరారు.

శ్రావణంలో వన మహోత్సవం



సమావేశంలో పాల్గొన్న నార్నూల్ అగర్వాల్ సమితి ప్రతినిధులు

చార్మినార్: నార్నూల్ అగర్వాల్ సమితి ఆధ్వర్యంలో రాబోయే శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని జూలైలో అయోధ్య తీర్థ యాత్ర సందర్భంగా వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడానికి సమితి ప్రతినిధులు ఏకగ్రీవంగా తీర్మానించారు. గురువారం సమితి కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో అధ్యక్షుడు అగర్వాల్ మాట్లాడుతూ.. జూలై 20 నుంచి 26 తేదీ వరకు ఈ వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. అయోధ్య శ్రీరాముని దర్శనంతో పాటు కాశీ విశ్వనాథ ఆలయ సందర్శన జరగనుందన్నారు. ఈ కార్యక్రమంలో రవీంద్ర అగర్వాల్, రాజేష్, రాజేంద్ర, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

మేరు కులస్తులకు పార్లమెంట్ ఎన్నికల్లో ప్రాధాన్యం ఇవ్వాలి



బట్టి విక్రమార్కను సత్కరిస్తున్న పోల్కం శ్రీనివాస్ మేరు

అబిడ్స్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మేరు కులస్తులకు కాంగ్రెస్ పార్టీ తరఫున అధిక ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ సీనియర్ జనరల్ సెక్రెటరీ పోల్కం శ్రీనివాస్ మేరు పేర్కొన్నారు. రాజ్యసభ, పార్లమెంట్ ఎన్నికల్లో మేరు కులస్తులకు టికెట్ ఇచ్చి అండగా నిలవాలన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్కను పోల్కం శ్రీనివాస్ ఘనంగా సత్కరించి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. మల్కాజిగిరి పార్లమెంటు నుంచి సీనియర్‌నైన తనకు టికెట్ ఇస్తే అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తానన్నారు. 35 ఏళ్ల పైగా కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ గల కార్యకర్తగా, నాయకుడిగా రాష్ట్రస్థాయిలో పలు పదవుల్లో పనిచేశానని ఆయన పేర్కొన్నారు. సోనియా గాంధీ రాహుల్ గాంధీ అధ్యక్షుడు మల్లికార్జున్ కార్యనీ కలిసి మెరు కులస్తులకు టికెట్ ఇచ్చే విధంగా విజ్ఞప్తి చేస్తామన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. మేరు కులస్తుల విజ్ఞప్తిని పార్టీ అధిష్టానానికి వివరిస్తానన్నారు.

15 నుంచి 19వ తేదీ వరకు విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

అబిడ్స్: ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు కార్వాన్ ఉప్పర బస్తీలో నూతన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహిస్తున్నామని ప్రముఖ సంఘ సేవకుడు సుక్క శ్రీనివాసరావు సగర తెలిపారు. 15వ తేదీన గురువారం గణపతి పూజ, పుణ్యాహ వాచనం, అఖండ దీపారాధన, సాయంత్రం విగ్రహాలను ఊరేగింపుతో ఆలయానికి తీసుకువస్తామన్నారు. 16వ తేదీ శుక్రవారం గోపూజ, గణపతి పూజ, గురువందనం ఉంటుందన్నారు. 17వ తేదీ శనివారం పుణ్యాహవాచనం, ప్రతిష్ఠ మహా సంకల్పం, దీక్షాధారణ, లక్ష్మీబోధారణ, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ, మూలమంత్ర హోమం, పలు పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. 18వ తేదీ ఆదివారం మండప దేవతపూజ, స్థాపిత దేవతా హోమాలు, మూలమంత్ర హోమం, మహా లింగార్చన ఉంటుందన్నారు. 19వ తేదీ సోమవారం యంత్ర స్థాపన, మూర్తి స్థాపన, ఇతర పూజా వేడుకలు చేపడుతున్నామన్నారు.

ఉత్సాహంగా గ్లోబల్ కల్చరల్ ఫెస్టివల్



అబిడ్స్: ఎగ్జిబిషన్‌లో గ్లోబల్ కల్చరల్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహించారు. పలువురు చిన్నారులతో పాటు మహిళా కళాకారులు వివిధ నృత్యాలు చేస్తూ అందరిని అలరించారు. గ్లోబల్ కల్చరల్ ఫెస్టివల్ కన్వీనర్ ముఖీర్ హైదర్, ఆర్గనైజర్ ప్రభాశంకర్‌లు వేడుకలను ప్రారంభించి కళాకారులను సన్మానించారు. కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఘనంగా రమాబాయి అంబేద్కర్ జయంతి




నివాళులర్పిస్తున్న మనోహర్ గైక్వాడ్, వినోద్‌కుమార్ తదితరులు

అబిడ్స్: రమాబాయి అంబేద్కర్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోషామహల్ నియోజకవర్గం మహర్ ఎస్సీ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు మనోహర్ గైక్వాడ్, వినోద్‌కుమార్ ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి

మణికొండ: ప్రతి ఒక్కరు తమ ఓటుహక్కును పొందడంతో పాటు అన్ని ఎన్నికల్లో వినియోగించుకోవాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్ హాల్ మార్క్ సిల్వనస్, నెక్నాంపూర్ గ్రామాల్లో ఆన్‌లైన్ ఓటుహక్కు పొందే కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధికులు బీజేపీకి వేసేందుకు సిద్ధంగా ఉన్నారని, అలాంటి వారికి స్థానికంగా ఓటుహక్కు లేదనే విషయాన్ని తెలుసుకుని కేంద్రాలను ఏర్పాటు చేసి చేర్పించామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మున్సిపాలిటీ ఓబీసీ అధ్యక్షుడు ఆనంద్‌రావు, మున్సిపాలిటీ పార్టీ ఉపాధ్యక్షుడు వేణుకుమార్, నాయకులు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పని చేస్తేనే ఆర్టీసీ అభివృద్ధి



ఆర్టీసీ సిబ్బందిని సన్మానిస్తున్న అధికారులు

అఫ్జల్‌గంజ్: ఆర్టీసీ అభివృద్ధి మన మందరం కలిసికట్టుగా పని చేయాలని హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తం పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్ డిపో–2లో ఏర్పాటు చేసిన త్రైమాసిక ప్రగతి చక్ర పురస్కారాలు కార్యక్రమానికి రంగారెడ్డి ఆర్‌ఎం శ్రీధర్‌తో కలిసి హాజరై ఉత్తమ ప్రతిభ కనబర్చిన సిబ్బందిని అభినందించారు. మహాలక్ష్మి పథకాన్ని విజయవంతం చేసినట్లుగానే రానున్న మేడారం జాతరను కూడా దిగ్విజయం చేయాలని సూచించారు. ఆర్‌ఎం శ్రీధర్ మాట్లాడుతూ..అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు తెలుపుతూ మిగతా సిబ్బంది వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం రాజు, సరిరామ్, రంగారెడ్డి రీజియన్ డిపో మేనేజర్లు, అవార్డు గ్రహీతలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ టికెట్‌ను కేటాయించండి

గన్‌ఫౌండ్రీ: సికింద్రాబాద్ పార్లమెంటు స్థానాన్ని యువ అభ్యర్థులకు కేటాయించాలని ఎన్‌ఆర్‌ఐ శ్రీపాద్ కోరారు. గురువారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఎన్‌ఎస్‌యూఐ విద్యార్థి దశ నుంచి గత కొన్ని ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్న తనకు సికింద్రాబాద్ పార్లమెంట్ టికెట్ కేటాయిస్తే తప్పకుండా విజయం సాధిస్తానని తెలిపారు. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో 10 శాతానికి పైగా ఉన్న ఒక సామాజిక వర్గానికి చెందిన ఓటు బ్యాంకును తాను సొంతం చేసుకుంటానని ఆశాభావం వ్యక్తం చేశారు.

నేడు డాక్టర్ కడిమిళ్ల వరప్రసాద్‌కు పురస్కార ప్రదానం

గన్‌ఫౌండ్రీ: ఈ నెల 9న రవీంద్రభారతిలో ప్రముఖ సహస్రవధాని డాక్టర్ కడిమిళ్ల వరప్రసాద్‌కు డాక్టర్ కేవీ రమణ జాతీయ జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నట్లు ప్రముఖ సాంస్కృతిక సంఘ సేవా సంస్థ వంశీ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు వంశీ రామరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు, పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర్ భారతి స్వామి, సినీ నటుడు తనికెళ్ల భరణితో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.


నేడు ఆచార్య మృణాళినికి పురస్కార ప్రదానం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో బుర్ర సుబ్రహ్మణ్య శాస్త్రి కళాపీఠం ఆధ్వర్యంలో ఈనెల 9న రవీంద్రభారతిలో ఆచార్య సి.మృణాళినికి సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు కళాపీఠం అధ్యక్షుడు ఆర్.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రామలింగేశ్వరరావు, అడిషనల్ కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డితో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

'వికసిత్ భారత్'ను సద్వినియోగం చేసుకోండి

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసే వికసిత్ భారత్‌కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని గౌలిపురా మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర తెలిపారు. డివిజన్‌లోని ఆలే నరేంద్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, పటేల్‌నగర్ ప్లే గ్రౌండ్‌లో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వికసిత్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆధార్ నమోదు కేంద్రం, బ్యాంక్ అకౌంట్ లేని వారికి అప్పటికప్పుడు ఓపెన్ చేయడం, ఉచిత వైద్య శిబిరం, ఉజ్వల గ్యాస్ కనెక్షన్ దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం పథకాలు లభించే ఈ కార్యక్రమాన్ని డివిజన్ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'మహిళలందరూ కాంగ్రెస్ వెంటే'



గోల్కొండ: రాష్ట్రంలో మహిళలందరూ కాంగ్రెస్ వెంటే ఉన్నారని మహిళా కాంగ్రెస్ ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఎస్.ఉషాశ్రీ అన్నారు. గురువారం ఆమె కార్వాన్‌లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు హామీలను పూర్తి చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గట్టి పట్టుదలతో ఉన్నారని అన్నారు. మహిళలు మొదటి నుంచే కాంగ్రెస్ వెంట ఉన్నారని సోనియాగాంధీని అభిమానించే మహిళలు ఎందరో ఉన్నారని ఆమె అన్నారు. రాహుల్‌గాంధీ చేపడుతున్న భారత్ జోడో న్యాయ యాత్రకు సైతం మహిళలు మద్దతు తెలుపుతూ స్వాగతం పలుకుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కురాకుల కృష్ణ, చంటిబాబు, వనజ, షకీలా తదితరులు న్నారు. ఈ సందర్భంగా ఆమె కార్వాన్ మహిళా కాంగ్రెస్ ఏ,బీ బ్లాక్ అధ్యక్షులుగా వసంత, షకీలను నియమిస్తూ నియామక ఉత్తర్వులను అందజేశారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు వైద్య పరీక్షలు



గోల్కొండ: కానిస్టేబుల్ అభ్యర్థులకు పోలీసు శాఖ వారు సూచించిన విధంగా తమ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా అన్నారు. గురువారం ఆయన తన వైద్య బృందంతో కలిసి గోల్కొండ ఏరియా ఆసుపత్రికి వైద్య పరీక్షల కోసం వచ్చిన కానిస్టేబుల్ అభ్యర్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి సర్టిఫికెట్లు అందజేశారు. సైఫాబాద్ ఇన్‌స్పెక్టర్ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వచ్చిన వారికి ఈ వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు.

'ప్రజా సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తుతాం'



మజ్లిస్ ఎమ్మెల్యేలు కౌసర్ మోహియుద్దీన్, మాజీద్ హుస్సేన్

గోల్కొండ: ప్రజా సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తి వాటి పరిష్కారానికి ప్రయత్నం చేస్తామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం అసెంబ్లీ సమావేశాలకు ఆయన నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్‌తో కలిసి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తమ పార్టీపై నమ్మకం ఉంచి ప్రజలు తమను ఎన్నుకున్నారన్నారు. పార్టీ అధిష్టానం సూచించిన విషయాలతో పాటు తమతమ నియోజకవర్గాల సమస్యలను సూటిగా అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని ఆయన అన్నారు. గత ప్రభుత్వ హయాంలో సైతం తాము ప్రజా సమస్యలపై అప్పటి ప్రభుత్వాన్ని ప్రశ్నించడం జరిగిందన్నారు.

కార్వాన్‌లో బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం



బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గోల్కొండ: అధికారం పోయినా బీఆర్‌ఎస్ నాయకులకు అహంకారం పోలేదని నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉస్మాన్‌బిన్ మహ్మద్ అల్‌హాజరీ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అసభ్య పదజాలంతో మాట్లాడి బీఆర్‌ఎస్ నాయకులు బాల్క సుమన్ దిష్టిబొమ్మను గురువారం కాంగ్రెస్ నాయకులు కార్వాన్‌లో దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నన్ని రోజులు అహంకారంతో వ్యవహరించిన బీఆర్‌ఎస్ ముఖ్యమంత్రితో పాటు ఆ పార్టీని ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తుగా ఓడించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్దుల్లా, అమ్జద్ తదితరులన్నారు.

చలో గావ్ కే ఔర్ బూత్ దర్శన్ అభియాన్‌కు విశేష స్పందన



రేషన్ డీలర్‌కు కర పత్రాన్ని అందజేస్తున్న కాంతికిరణ్

నాంపల్లి: చలో గావ్ కే ఔర్ బూత్ దర్శన్ అభియాన్ కార్యక్రమం గురువారం మల్లేపల్లి డివిజన్లో జరిగింది. డివిజన్‌లో చేపట్టిన ఈ కార్యక్రమానికి విశేషమైన స్పందన లభించింది. ఇందులో భాగంగా బీజేపీ నేతలు పలు పోలింగ్ బూత్‌లను, రేషన్ సరుకుల దుకాణాలను సందర్శించారు. రేషన్ డీలర్లకు కర పత్రాలను అందజేశారు. ముఖ్యఅతిథిగా ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాంతికిరణ్ హాజరయ్యారు. ఎస్సీ మోర్చా బూత్ ఇన్‌చార్జి మంగళారపు రామ్‌దాస్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.అరవింద్, డివిజన్ అధ్యక్షులు జగన్నాథరాజు, నేతలు సుభాష్, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో జియాగూడ మాజీ కార్పొరేటర్ మృతి



జియాగూడ: జియాగూడ మాజీ కార్పొరేటర్ ఆదిరాల మునేందర్ గురువారం సాయంత్రం తుది శ్వాస విడిచారు. రెండు రోజుల నుంచి ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్న మునేందర్ పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. ఇమాంపురాలో ఉన్న మునేందర్ 45 ఏళ్ల నుంచి బీజేపీలోనే సామాన్య కార్యకర్తగా ఉంటూ ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తగా కూడా కొనసాగుతూ 2002లో జియాగూడ బీజేపీ కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. ఎన్నికైన అనంతరం జియాగూడ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. రాష్ట్ర బీజేపీ దళిత మోర్చా ఉపాధ్యక్షుడిగా, ఇమాంపురా నవభారత్ సంఘం అధ్యక్షుడిగా సేవలందించారు. ఇంత చేసిన తనకు సొంత ఇల్లు లేకపోగా నేటికీ అద్దె ఇంట్లో ఉండేవారు. గతేడాది జూన్‌లో హార్ట్‌ఎటాక్ కూడా వచ్చింది. అప్పటి నుంచి ఇంటికే పరిమితమయ్యాడు. శుక్రవారం అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మహిళ అదృశ్యం



పోచమ్మ

అబిడ్స్: మహిళ అదృశ్యమైన ఘటన మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జాలి హనుమాన్‌లో పోచమ్మ, ఎశప్ప భార్యాభర్తలు నివాసముంటున్నారు. ఈనెల 5న పోచమ్మ ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె భర్త ఎశప్ప మంగళ్‌హాట్ పోలీసులను ఆశ్రయించాడు. ఎస్ఐ.సుబ్రహ్మణ్యం కేసు నమదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోచమ్మ 5.2 అడుగుల ఎత్తు, చుడిదార్ పైజామ ధరించి ఉందని, ఆచూకి లభిస్తే మంగళ్‌హాట్ పోలీసులకు తెలపాలని ఎస్ఐ తెలిపారు.

బజార్‌ఘాట్‌లో నూతన అగ్నిమాపక కేంద్రం ప్రారంభం



నాంపల్లి: బజార్‌ఘాట్ ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి ఎదురుగా అగ్నిమాపక కేంద్రం ప్రారంభమైంది. ఈ అగ్నిమాపక కేంద్రాన్ని గురువారం నాంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. గతంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. నాంపల్లిలో వరుస అగ్ని ప్రమాదాలు జరుగుతున్న కారణంగా, నూతన అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తుల మేరకు కొత్త కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వివరించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



గంగాధర్

నాంపల్లి: శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని మాసబ్‌ట్యాంక్ ఇన్‌స్పెక్టర్‌గా సీహెచ్. గంగాధర్ పేర్కొన్నారు. బాధ్యతలు స్వీకరించిన ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. అసాంఘిక శక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తానని చెప్పారు. 2009లో ఎస్సై బ్యాచ్‌గా పోలీసు శాఖలో చేరిన గంగాధర్ ఆర్సీపురం, అల్వాల్, మియాపూర్, పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పనిచేశారు.

బల్కా సుమన్‌పై ఫిర్యాదు



ఫిర్యాదు పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు కృష్ణ తదితరులు

గోల్కొండ: బీఆర్‌ఎస్ నాయకుడు బాల్క సుమన్‌పై లంగర్ హౌస్ పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. మంగళవారం కాంగ్రెస్ నాయకులు కురాకుల కృష్ణ, చంటి బాబుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు లంగర్ హౌస్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్‌రావుకు ఫిర్యాదు పత్రం అందజేశారు. బాల్క సుమన్ హద్దులు దాటి మాట్లాడుతున్నారని ముఖ్యమంత్రిపై అసభ్య పదజాలంతో మాట్లాడినందున ఆయనపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు పత్రంలో పేర్కొన్నామన్నారు.

నా భర్త పెన్షన్ నాకు ఇప్పించండి



రుక్కమ్మ


నాంపల్లి: బల్దియాలో కామాటిగా పనిచేసి పదవీ విరమణ పొందిన దానయ్య మృతి చెందిన రెండున్నర ఏళ్లు పూర్తయినా తనకు పెన్షన్ ఇవ్వడం లేదని బాధితురాలు, దానయ్య భార్య రుక్కమ్మ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఆమె నాంపల్లిలో విలేకర్లతో మాట్లాడారు. ఉప్పుగూడ అశోక్‌నగర్ హరిజన బస్తీలో తాను నివాసం ఉంటున్నట్లు తెలిపారు. తన భర్త బల్దియాలో కామాటిగా పనిచేస్తూ పదవీ విరమణ తీసుకుని 16 ఆగస్టు 2021న మృతి చెందినట్లు పేర్కొన్నారు. పెన్షన్ కోసం ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయిందన్నారు. తన భర్తకు రావాల్సిన పెన్షన్ తనకు ఇప్పించాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తోందన్నారు. పెన్షన్ కోరితే సర్వీసు బుక్ లేదంటూ నాన్చుడు ధోరణితో బల్దియా అధికారులు, సిబ్బంది కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు.

హుక్కా సెంటర్‌పై పోలీసుల దాడి

14 మంది రిమాండ్

బహదూర్‌పురా: అక్రమంగా నిర్వహిస్తున్న హుక్కా సెంటర్‌పై బహదూర్‌పురా పోలీసులు దాడి చేసి నిర్వాహకుడితో పాటు 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ హబీబుల్లా ఖాన్ తెలిపిన ప్రకారం..బహదర్‌పురా చౌరస్తాలోని ఫిజా హోటల్‌పై అంతస్తులో హుక్కా కేంద్రాన్ని నిర్వహిస్తున్నారనే సమాచారం అందుకున్న బహదూర్‌పురా పోలీసులు బుధవారం రాత్రి సెంటర్‌పై దాడి చేసి నిర్వాహకుడు సోహెల్ హుస్సేన్‌తో పాటు హుక్కా పీలుస్తున్న 14 మంది యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 21 హుక్కా సామగ్రి, ఒక కిలో హుక్కా ఫ్లేవర్, 16 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. 14 మందిపై కేసు నమోదు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం



విజయనగర్‌కాలనీ: గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన గురువారం ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. అడ్మిన్ ఎస్ఐ మహ్మద్ జాహెద్ తెలిపిన వివరాల ప్రకారం..గురువారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఓ గుర్తుతెలియని మహిళ (55) ఆసిఫ్‌నగర్ జిర్రా రోడ్డులోని సిటీ డైమండ్ హోటల్ వద్ద పడిఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా అప్పటికే ఆమె మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.